

గణేష్‌నగర్‌లో ఎమ్మెల్యే పర్యటన



బాలరాజ్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ గణేష్‌నగర్‌లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శుక్రవారం పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన రోడ్లను, విద్యుత్ స్తంభాలను, గుంతలు పడ్డ రోడ్లను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన గణేష్‌నగర్‌కాలనీ మాజీ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్‌ను పరామర్శించి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, బస్తీ వాసులు మైసయ్యగౌడ్, నేత శ్రీనివాస్, శ్యామ్‌సుందర్, కొండపల్లి మాధవ్, సురేందర్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హేమ జిల్లోజు


కవాడిగూడ: ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28న రోటరీక్లబ్ పార్కులో జరిగే బతుకమ్మ సంబరాలు సాయంత్రం 5గంటల నుంచి మొదలవుతాయని కన్వీనర్ హేమ జిల్లోజు తెలిపారు. శుక్రవారం ఆప్ రాష్ట్ర కార్యాలయంలో బతుకమ్మ సంబరాలకు సంబంధించిన పోస్టర్ ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర నాయకులతో పాటు నటీనటులు గాయత్రీ గుప్తా, మహతి, రాంకీ, సప్తగిరి, సంపూర్ణేష్ బాబు, దువ్వాడ శ్రీనివాస్, మాధురి తదితరులు పాల్గొంటారని రాష్ట్ర మాజీ మహిళా అధ్యక్షురాలు హేమ జిల్లోజు గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుర్ర రాము గౌడ్, ఎస్ కె అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

టీసీడీఏయూ ఎన్నికలను వాయిదా వేయాలి



చిక్కడపల్లి: తెలుగు సినీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ (టీసీడీఏయూ) ఎన్నికలను ప్రభుత్వం వెంటనే వాయిదా వేయాలని తెలంగాణ సినిమా వేదిక గౌరవ అధ్యక్షుడు ప్రఫుల్ రాంరెడ్డి, అధ్యక్షుడు లారా కోరారు. ఈ మేరకు ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కార్యాలయంలో అదనపు కమిషనర్ గంగాధర్‌ను శుక్రవారం సాయంత్రం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి కేడీ రాజు, కోశాధికారి నర్సింహారెడ్డి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆర్టిస్టులు కానివారి వద్ద డబ్బులు తీసుకొని సభ్యత్వాన్ని ఇస్తున్నారని తెలిపారు. దీంతో నిజమైన ఆర్టిస్టులకు అన్యాయం జరుగుతోందన్నారు. సభ్యత్వాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న జరుగనున్న యూనియన్ ఎన్నికలను వాయిదా వేయాలని అదనపు కమిషనర్‌ను కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు మోహన్ బైరాగి, గోవిందరాజు, శంకర్, కేసీఎస్ ప్రసాద్, నర్సయ్య, అంజలికుమారి, సుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గాంధీనగర్ బీజేపీ అధ్యక్షుడు నవీన్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ చౌరస్తాలో కార్పొరేటర్ పావని ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన భారీ ఎత్తున నిర్వహించే బతుకమ్మ పండుగ వేడుకలను విజయవంతం చేయాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్ కోరారు. శుక్రవారం కార్పొరేటర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బతుకమ్మ కమిటీ, బీజేపీ నేతలతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. బతుకమ్మ ఆడేందుకు డివిజన్ మహిళలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ప్రత్యేక ఆకర్షణగా వచ్చే సెలబ్రిటీలకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంధ్యారాణి, మంగమ్మ, పూర్ణ, స్వప్న, రత్న సాయిచంద్, దామోదర్, శ్రీకాంత్, కృష్ణ ప్రసాద్, రాహమత్ అలీ పాల్గొన్నారు.

ఆర్డర్.. హడల్

పనులు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశంతో హడలెత్తిపోయిన అధికారులు

- జీహెచ్‌ఎంసీ తరపు న్యాయవాదులు సమయం కోరినా ఒప్పుకోని హైకోర్టు
- కోర్టు ఆదేశాలు గౌరవించి పూర్తి చేస్తారా.. లేక అదే పద్ధతిని కొనసాగిస్తారా.?

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ చిక్కడపల్లి సోప్ ఫ్యాక్టరీ లేన్ స్ట్రీట్ నం.10లో 20 రోజుల క్రితం రోడ్డును తవ్వి ఎక్కడమట్టి అక్కడే వదిలివేశారు. మట్టిదిబ్బలు పెద్ద ఎత్తున ఉండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కార్లతో పాటు ద్విచక్ర వాహనాలు కూడా రాకుండా పోకుండా అయ్యాయి. వృద్ధులు, గర్భిణులు, స్కూల్ పిల్లలు ఆ గల్లీలో ఉన్న వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు, ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. దీంతో చేసేది లేక స్థానికులు హైకోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది.

◆ అదే గల్లీలో నివాసం ఉంటున్న ప్రముఖ సామాజికవేత్త కందూరి కృష్ణ కుమారుడు, హైకోర్టు అడ్వకేట్ కందూరి కౌశిక్, న్యాయవాది కందూరి జ్వాలవరలని హైకోర్టులో వారం క్రితం పిటిషన్ వేశారు. దీంతో తెలంగాణ హైకోర్టు మూడు రోజుల్లో పనులు పూర్తి చేయాలని శుక్రవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసినట్లు కందూరి కృష్ణ తెలిపారు.

◆ జీహెచ్‌ఎంసీ కమిషనర్, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్, సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్లకు రహదారి పనులను తక్షణమే పూర్తి చేయాలని అలాగే నీటి నిల్వలు, చెత్త నిర్మాణ వ్యర్థాలను తొలగించి కొత్త రహదారి వేయాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ తరపు న్యాయవాది అదనపు సమయం కోరినప్పటికీ వారి విజ్ఞప్తిని న్యాయస్థానం పరిగణలోకి తీసుకోకుండా పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని కోర్టు ఆదేశించినట్లు వారు తెలిపారు. మరి అధికారులు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తారో లేదో చూడాలి.



చిక్కడపల్లి స్ట్రీట్ నం.10లో రోడ్డును తవ్వి వదిలేయడంతో అధ్వానంగా మారిన రహదారి

కోర్టు ఆదేశించింది

హైకోర్టు అడ్వకేట్ కందూరి కౌశిక్



20 రోజుల క్రితం రోడ్డును తవ్వి మట్టి దిబ్బలు తొలగించకుండా నిర్లక్ష్యంగా వదిలివేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. నేను వారం రోజుల క్రితం హైకోర్టులో రిట్ పిటిషన్ వేశాం. దీంతో హైకోర్టు మూడు రోజుల్లో రోడ్డు మరమ్మతులను పూర్తి చేయాలని ఆదేశించింది. జీహెచ్‌ఎంసీ న్యాయవాది విజ్ఞప్తిని సైతం పరిగణలోకి తీసుకోకుండా వెంటనే పూర్తి చేయాలని కోర్టు ఆదేశించడం హర్షణీయం.

కాంగ్రెస్ మాటలు చెప్పి పబ్బం గడపదు

టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ ఆలంఖాన్



అంబర్‌పేట: పార్లమెంట్ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ ఆలంఖాన్ తెలిపారు. రాష్ట్రంలో కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంశం దేశానికి రోల్‌మోడల్ అని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ముందు నుంచీ ప్రజా సంక్షేమం కోసం సాహసోపేత నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తుందే తప్ప బీజేపీలా మాటలు చెప్పి పబ్బం గడపదని ఆయన విమర్శించారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే సూచనలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పాలించే రాష్ట్రాల్లో అభివృద్ధిపై ఎక్కడైన చర్చకు సిద్ధమన్నారు. రాహుల్‌గాంధీ ఆలోచనలు పేదలకు మేలు చేసేందుకు వాస్తవానికి దగ్గరగా ఉంటాయన్న విషయాన్ని బీజేపీ గమనించాలని ఆయన హితవు పలికారు.

దివ్యాంగులకు అండగా కేంద్రం

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దివ్యాంగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాను చేపట్టిందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ దివ్యాంగుల రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వర్ రావు కేంద్రమంత్రిని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌ను కేంద్రమంత్రి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. 11 సంవత్సరాల నుంచి దివ్యాంగుల కోసం వేలాది కోట్లు ఖర్చు పెట్టి పరికరాలను అందజేస్తున్నామని తెలిపారు. వారికి ఆత్మస్థైరం, ఆర్థికంగా ఎదుగుదల కోసం నరేంద్రమోదీ ఎన్నో కార్యక్రమాలు, ఎన్నో పథకాలను తీసుకొచ్చారని అన్నారు. కార్యక్రమంలో జంగిల్ శ్రీనివాస్, నరేష్, పంది శ్రీనివాస్, రాంచందర్ రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



కొల్లి నాగేశ్వరరావును అభినందిస్తున్న జి.కిషన్‌రెడ్డి



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు శుక్రవారం అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ పార్టీలు, సంఘాల నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... భూమి భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఐలమ్మ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం



నివాళులర్పిస్తున్న వల్లభనేని ప్రసాద్



రాంనగర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోపాల్



లోయర్ ట్యాంక్‌బండ్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే ముఠాగోపాల్

రైల్లో బ్యాగ్ చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి బ్యాగు చోరీకి గురైన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు శుక్రవారం జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ధర్మవరానికి చెందిన ఎ.మహేశ్వర్‌రెడ్డి అనంతపూర్ నుంచి కాచిగూడకు రావడానికి రైల్లో దివ్యాంగుల బోగిలో కూర్చుని ప్రయాణిస్తున్నారు. డోన్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన సమయంలో చూసుకునే సరికి అతడి బ్యాగు కనిపించలేదు. బ్యాగులో సెల్‌ఫోన్, 10 మెమో, దివ్యాంగుల సర్టిఫికెట్ ఉందని బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కర్నూల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

హుండీ కానుకల లెక్కింపు



కవాడిగూడ: దోమలగూడ హనుమాన్ దేవాలయ ఆరు నెలల హుండీ కానుకలను శుక్రవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ, ఈఓ దేవనాథం సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులు లెక్కించారు. రూ.1,27,108 వచ్చినట్లు కమిటీ చైర్మన్ కేఆర్‌కే ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వెంకట్‌రెడ్డి, ఆర్.రాము, వై.కృష్ణ, మంజుల, శివకుమార్ యాదవ్, జై మహేందర్, పూజారులు అల్లం ప్రభు, శేషాచారి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దసరా పురస్కారాల ప్రదానోత్సవం



ప్రముఖులను సన్మానిస్తున్న ఆచార్య మసన చెన్నప్ప, కవి రామకృష్ణ చంద్రమౌళి

చిక్కడపల్లి: తెలుగు భాషా చైతన్య సమితి, త్యాగరాయ గానసభ, నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరిస్వామి యాదవ్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో శుక్రవారం కళా లలిత కళా వేదికలో దసరా సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య మసన చెన్నప్ప ఎంపిక చేసిన పలువురు ప్రముఖులు దసరా పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన దసరా ప్రాముఖ్యతను వివరించారు. ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటుతుందన్నారు. దాని పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత కవులు, కవయిత్రులపై ఉందన్నారు. తొలుత కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్పర్సన్ రాధాకుసుమ నిర్వహణలో విజయదశమి అంశంపై కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు నామోజు బాలాచారి, మనోహర్‌రెడ్డి, సీతాలక్ష్మి, శ్రీనివాస్‌యాదవ్, బడేసాబ్, చంద్రవక్రాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ ముషీరాబాద్ అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్



కవాడిగూడ: ధర్మ సమాజ్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడిగా కవాడిగూడకు చెందిన గుడపర్తి సంతోష్ నియమితులయ్యారు. శుక్రవారం ధర్మ సమాజ్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కమల్ ఆయన నియామక పత్రం అందజేశారు. అదే విధంగా నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా గట్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా డి.కిరణ్‌కుమార్, కోశాధికారిగా నిమ్మల మనోజ్‌కుమార్, కార్యదర్శులుగా శివప్రసాద్, నర్సింగ్ రావు, సభ్యులుగా సాయిగోపాల్, మురళి, పాత్రు ప్రజాపతి, శ్రీనివాస్‌ను నియమించారని తెలిపారు. తమపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన పార్టీ పెద్దలకు సంతోష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

చెట్ల నరికివేతపై అటవీ అధికారులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేసిన ఎస్‌సీహెచ్ రంగయ్య

కాచిగూడ: నగరంలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా చెట్లను నరికివేయడంపై ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య ఆందోళన వ్యక్తం చేశారు. చెట్లు నరికివేతకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన హైదరాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల హిమాయత్‌నగర్ ఒకటో వీధి సమీపంలో ప్రధానరహదారి ఫుట్‌పాత్‌పై ఉన్న భారీ చెట్లును నరికి వేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. పచ్చదనాన్ని, స్వచ్ఛమైన గాలిని అందించే చెట్లను నరివేయడం పర్యావరణానికి తీవ్ర ముప్పు అని ఆయన హెచ్చరించారు. అధికారుల ఉదాసీనత కారణంగానే నగరంలో తరచుగా చెట్ల నరికివేతకు గురవుతున్నాయని ఆయన విమర్శించారు. క్షేత్రస్థాయిలో ఉన్న అధికారుల పాత్రపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



గాంధీనగర్‌లో జరిగిన అమ్మవారి పూజలో బీజేపీ సీనియర్ నేత వినయ్‌కుమార్

శరన్నవరాత్రి మహోత్సవం

వాడవాడలా ఆధ్యాత్మికం



ఇంద్రాణిగా శంకరమఠం శారదామాత



మహాలక్ష్మిగా అంబర్‌పేట మహంకాళి



జైస్వాల్‌గార్డెన్‌లో మహాలక్ష్మిగా అమ్మవారు



ధనలక్ష్మిగా బతుకమ్మకుంట మైసమ్మ



మహాలక్ష్మిగా కనకాల కట్టమైసమ్మ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం (ఐదో రోజు) అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, సహస్రనామార్చనలు నిర్వహించారు. ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. ఆలయాలు, మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మండపాల వద్ద మాతారాణికా జాగారణ్ కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లువిరిసింది.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం



భోలక్‌పూర్ డివిజన్ పోస్ట్ ఆఫీస్ వద్ద శివాజీ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు



పటేల్‌నగర్ చౌరస్తాలో అమ్మవారి వేడుకల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



చెన్నారెడ్డినగర్‌లో ..



కాచిగూడలో జరిగిన మాతా రాణికా జాగారణ్‌లో దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు



లలిత సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు



గోల్నాకలో అన్నాదాన కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య



చిక్కడపల్లి నేతాజీ మండపంలో జరిగిన పూజలో భక్తులు



మహంకాళి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకల్లో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్



నారాయణగూడ ఐపీఎంలో జరిగిన పూజలో టీఎన్జీవోస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్



మహంకాళి ఆలయంలో జరిగిన హోమంలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి